క్లుప్తంగా

టీడీపీకి మద్దతుగా ప్రభుత్వ వైద్యాధికారి పోస్టులు



జి.కొండూరు: జి.కొండూరు మండల వైద్యాధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ గత కొన్ని నెలలుగా మెటరినిటీ లీవ్‌లో ఉన్న డాక్టర్ శ్రీ కల్యాణి టీడీపీకి మద్దతుగా సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మైలవరం అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్ పోస్టర్లను తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నత స్థానంలో ఉండి ఒక రాజకీయ పార్టీని సపోర్టు చేస్తూ పోస్టులు చేయడంపై స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కోడ్ ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ (ఏఐ అండ్ ఎమ్ఎల్) ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడు పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ (ఏఐ అండ్ ఎమ్ఎల్) ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకుడిగా పనిచేస్తున్న షేక్ జమీర్ అమరావతి వీఐటీ-ఏపీ యూనివర్శిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో హ్యూమన్ యాక్టివిటీ రికగ్నిషన్ యూజింగ్ మొబైల్ అండ్ వేరబుల్ సెన్సార్స్ విత్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు తెలిపారు. అమరావతి వీఐటీ-ఏపీ యూనివర్శిటీఅసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హుస్సేన్ సయ్యద్ పర్యవేక్షణలో జరిగిందన్నారు.

ముగ్గురి అరెస్ట్

150 మద్యం సీసాలు స్వాధీనం

తిరువూరు: తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులకు శనివారం ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. ఎస్ఈబీ సీఐ ఆశోక్ తెలిపిన వివరాల ప్రకారం విస్సన్నపేట మండలం కొండపర్వలో తెలంగాణ నుంచి తెచ్చిన మద్యం విక్రయిస్తున్న అన్నంశెట్టి సాంబశివరావు నుంచి 87 తెలంగాణ మద్యం సీసాలను, పుట్రేలలో కొచ్చెర్ల అన్నమ్మ నుంచి 33, సత్యాలపాడులో నాగనబోయిన కొండాలు నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలలో ఎస్ఈబీ ఎస్ఐలు రఘు, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ ఎంపీడీవో ఎ.శ్రీరమ్య శనివారం పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పైడూరుపాడు, రాయనపాడు, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సచివాలయాల సిబ్బందితో ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి సమావేశాలు నిర్వహించారు. రాజకీయ పార్టీలకు చెందిన ఎలాంటి బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ఉండరాదన్నారు. ఎంపీడీఓ పాటు కార్యాలయ జూనియర్ అసిస్టెంటు విజయబాబు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలన్నారు.

బాల్య వివాహాలను నిరోధించండి


చౌటపల్లి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న సీడీపీవో సత్యవతి


పుల్లూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీవో పుష్పలత, సిబ్బంది


నూజివీడులో మాట్లాడుతున్న సీడీపీవో ఎస్వై నూరాని

అవగాహన సదస్సుల్లో సీడీపీవోలు

తిరువూరు: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, ఇటువంటి సంఘటనలు జరగకుండా అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు కృషి చేయాలని ఐసీడీఎస్ తిరువూరు ప్రాజెక్టు సీడీపీవో సత్యవతి సూచించారు. మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్యకార్యకర్తలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. బాలికలకు విద్యా ఉద్యోగావకాశాలు గతంలో కంటే ఎంతో మెరుగుపడ్డాయని, పురుషులతో సమానమైన అధికారాలూ లభిస్తున్నాయని సత్యవతి అన్నారు. బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడినా, అసభ్యకరంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోడానికి చట్టాలున్నాయన్నారు. చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కే పూజిత మాట్లాడుతూ భ్రూణ హత్యల నివారణకు, బాలికల్లో రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఆరోగ్య, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య సమాజం

పుల్లూరు(మైలవరం): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ పుష్పలత తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా పక్షోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ, విజయవాహినీ చారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం గర్భిణులు,బాలింతలు, కౌమార దశలోని బాలికలకు పౌష్టికాహారంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పుష్పలత మాట్లాడుతూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనతకు చెక్ పెట్టవచ్చన్నారు. సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో వెల్‌బేబీ షో నిర్వహించారు. ఎమ్. లలితకుమారి వివిధ రకాల వంటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తల టీమ్ లీడర్ శారద, కార్యకర్తలు, విజయవాహని చారిటబుల్ ఫౌండేషన్ బ్లాక్ కో ఆర్డినేటర్ కే శిరీష, ఎమ్.భార్గవి, వీ భూలక్ష్మి, పోషణ్ సఖి సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం

నూజివీడు: పిల్లలు, కిశోరబాలికలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడం ద్వారా మెరుగైన ఆరోగ్య సమాజాన్ని తీర్చిదిద్దవచ్చనే లక్ష్యంతో ప్రభుత్వం పోషకాహార పక్షోత్సవాలను నిర్వహిస్తోందని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీవో ఎస్వై నూరాణి అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీవో మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని, రక్తహీనతను, తక్కువ బరువుతో పుట్టే పిల్లలను తగ్గించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందన్నారు. అధిక పోషకాలు ఉన్న ఆహార పదార్థాలను ప్రతిరోజూ భోజనంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కొవ్వు పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని, ఎక్కువ వేపుడు చేసిన పదార్థాలను తినకూడదన్నారు. ఫైబర్ ఎక్కువ ఉన్న పదార్థాలను తీసుకోవాలని, పిల్లలను జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంచాలన్నారు. గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు, కిశోర బాలికలకు పోషకాలు ఎక్కువగా ఉండే చిరుధాన్యలతో తయారు చేసిన ఆహార పదార్థాలను అందించాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు తమ పరిధిలోని మహిళలకు పోషకాహారం వల్ల కలిగే లాభాల గురించి అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, బాలింతలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

నెమలిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం


పెండ్లి కుమారుడైన నెమలి కృష్ణుడు

నెమలి(గంపలగూడెం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఆరురోజులపాటు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయ సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖల పర్యవేక్షణలో సుప్రభాతసేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు, అర్చకబృందం ప్రారంభించారు. ముందుగా శ్రీవేణుగోపాలస్వామి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తులకు పంచామృతాల, నవఫలరసాలతో అభిషేకం చేశారు. పెండ్లికుమారుని చేసే ఘట్టం వైభవంగా జరిగింది. ఆలయ సహాయ కమిషనర్, చైర్మన్‌లు స్వామి వారికి నూతన వస్త్రాలు సమర్పించారు. స్వామికి నూతన వస్త్రాలు, సువర్ణాభరణాలు, వివిధ రకాల పూలమాలలతో అలంకరించగా భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నెమలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజు ఆదివారం పెండ్లికుమారుడైన శ్రీవేణుగోపాలస్వామి ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనారూఢులై తిరువీధుల్లో విహరిస్తారు. రాత్రికి స్థానిక గాంధీబొమ్మ సెంటర్ వద్ద స్వామి, రుక్మిణీదేవి, సత్యభామ అమ్మవార్లు ఎదురుకోలు ఉత్సవం ఉంటుంది.

జి.కొండూరు: వెల్లటూరు శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు రెండు రోజులు నుంచి ఘనంగా జరుగుతున్నాయి. శనివారం దేవాలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచన, నిత్యహోమం, బలిహరణ, విశేషార్చన, నవగ్రహ హోమం, తిరుకళ్యాణ మహోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం చేశారు.

మీ కుటుంబ సభ్యుడిగా ఆదరించండి


కోడూరు గ్రామంలో స్థానికులతో ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు

జి.కొండూరు: సామాన్యుడిగా, ప్రతి కుటుంబంలోని ఒక సభ్యుడిగా ఎన్నికల బరిలోకి దిగుతున్న తనకు మైలవరం నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు అన్నారు. మండలంలోని కోడూరు, చిన్ననందిగామ, వెల్లటూరు, కందులపాడు, ముత్యాలంపాడు, ఆత్కూరు, పినపాక, కట్టుబడిపాలెం, జి.కొండూరు, గుర్రాజుపాలెం, కుంటముక్కల, వెంకటాపురం, చెవుటూరు, కవులూరు గ్రామాలలోని నాయకులు, కార్యకర్తలతో సర్నాల తిరుపతిరావు విస్తృతస్థాయి సమావేశాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిరావుకి ఆయా గ్రామాలలో ఘన స్వాగతం లభించింది. తిరుపతిరావు మాట్లాడుతూ మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేస్తేనే కుల, మత బేధాలు లేకుండా ప్రతి పేదవాడు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలోపేతమవుతాడని అన్నారు. సామాన్యులను సైతం చట్ట సభలకు తీసుకెళ్లాలనే జగనన్న ఆలోచనకు ప్రత్యక్ష సాక్ష్యమే తనకు ఈ అవకాశం అని చెప్పారు. స్థానికంగా ఉండే తాను ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మైలవరం నియోజకవర్గంలో తన గెలుపు మరో చరిత్రకు మలుపు కావాలని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐఎస్ఓ అవార్డులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి, అధ్యాపకులు

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఐఎస్ఓ (ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్)గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాటిస్తున్న అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు గుర్తిస్తూ కళాశాలకు ఐఎస్ఓ గుర్తింపు ధ్రువ పత్రాలు ఇచ్చారన్నారు. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్‌శక్తి వనరులను పొదుపు, నీటి వనరులు, వర్షపు నీరు పరిసరాల పరిశుభ్రత తదితరాలకు నిర్వహణకు గ్రీన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ అవార్డును ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. కళాశాలలో ఐఎస్ఓ మేనేజ్‌మెంట్ ఆడిట్, గ్రీన్ ఆడిట్ నిర్వహించిన హెచ్ వైఎమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ కళాశాలలో సదుపాయాలను క్యాంపస్ నిర్వహణలో పాటిస్తున్న ప్రమాణాలను ప్రశంసించినట్లు తెలిపారు. సంస్థ అధినేత ఎ.శివయ్య మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రంలో ఉన్నత ప్రమాణాలు అందుకున్న కళాశాలలో ఒకటి ఈ కళాశాల అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం యువతకు స్ఫూర్తి


నూజివీడులో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు


పెనుగొలనులో అమరవీరులకు నివాళి

నూజివీడు: నేటి యువత భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని, సామాజిక బాధ్యతను పెంపొందించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని పెద్దగాం, దీబొమ్మ సెంటర్‌లో శనివారం భగత్‌సింగ్ వర్ధంతిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం, స్వాతంత్ర్యం ఇచ్చిన లౌకిక రాజ్యానికి తూట్లు పొడుస్తున్న పార్టీలకు రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడమే భగత్‌సింగ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు చాట్ల పుల్లారావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, నాయకులు చందర్‌రావు, కృష్ణ, అప్పలనాయుడు, సత్తిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాటం యువతకు స్ఫూర్తి

పెనుగొలను(గంపలగూడెం): మండలంలోని పెనుగొలనులో షిర్డీసాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరవీరులైన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు జీ నరసింహారావు మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో వీరోచితంగా పోరాడిన వీరిని బ్రిటీష్‌వారు 1931 మార్చి 23వ తేదీన ఉరితీశారన్నారు. వారిత్యాగాలకు గుర్తుగా ప్రతియేటా అమరవీరుల దినోత్సవం నిర్వహిస్తారని, యువత వారి పోరాటపటిమ, పట్టుదలను ఆదర్శంగా తీసుకొని దేశసమగ్ర అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పలువురు విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏ.కొండూరు: విప్లవ వీరుడు భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుమార్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని కంభంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గుర్ సుఖదేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మణికంఠ, గంగాధర్‌రావు, ప్రధానోపాధ్యాయులు ఆదిశేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరురూరల్: స్వాతంత్ర్యోద్యమంలో వీరమరణం పొందిన సర్దార్ భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని తిరువూరు మండలంలోని లక్ష్మీపురం, గానుగపాడు పాఠశాలల్లో శనివారం నిర్వహించారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి ఉరికంబం ఎక్కిన అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆదిలక్ష్మి సూచించారు. అమరవీరుల చిత్రపటాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వీరోచిత గాధను ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ విద్యార్థులకు వివరించారు.

తిరువూరు: స్వాతంత్ర్య సంగ్రామంలో అశువులు బాసిన సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురుదేవ్, సుఖదేవ్‌ల వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సీపీఐ, ఏఐవైఎఫ్ఐ నాయకులు తూము కృష్ణయ్య, ఎస్‌కే మీరా, మాలపాటి ఉదయ్, సుబానీ తదితరులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోస్ సెంటర్లో సీఐటీయూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అభిషేకం

పేరంటాళ్ళ గుట్ట(గంపలగూడెం): మండలంలోని వినగడప శివారు పేరంటాళ్లగుట్ట వద్ద విరాజిల్లుతున్న అచ్చంపేరంటాళ్లమ్మ ఆలయంలో అమ్మవారికి శనివారం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. యేటా పాల్గుణమాసం పౌర్ణమి ముందు రెండు రోజులపాటు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, కోటేశ్వరశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. తదుపరి నిర్వహించిన ప్రత్యేక పూజలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. శనివారం రాత్రికి వినగడప నుంచి గ్రామరాశి ప్రభబండిని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఆదివారం తెల్లవారుఝాముకు ఆలయం వద్దకు తోడ్కొని వచ్చారు. ఉత్సవాలు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం: టీడీపీ అభ్యర్థి వసంత వెంకటకృష్ణప్రసాద్‌కు మద్దతుగా స్థానిక రింగ్ సెంటర్‌లో ఎన్నికల నియమావళి ఉల్లంఘించి బాణసంచా కాల్చిన టీడీపీ నాయకులపై శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎటువంటి అనుమతి లేకుండా 65వ నంబర్ జాతీయ రహదారిపై వసంత వెంకట కృష్ణప్రసాద్ ఫొటో ప్రదర్శించి ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు విరుద్ధమని ఎస్ఐ పాపారావు తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ఇన్‌చార్జ్ వై.శంకర్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మడుపల్లి ఆనంద్, చల్లా దుర్గారావు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

మళ్లీ జగనన్నకు పట్టం కడదాం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు

ఆగిరిపల్లి: ప్రజారంజక పాలన అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. ఆగిరిపల్లి-1వ వార్డులో శనివారం నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ గత చంద్రబాబు పాలనలో సంక్షేమం ఊసే లేదని, అభివృద్ధి అటకెక్కిందని తెలిపారు. నేడు జగనన్న ఐదేళ్ల పాలనలో అద్భుతాలు చేశారని తెలిపారు. మరోసారి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా మేకావెంకట ప్రతాప్ అప్పారావుని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనా కుమారి, సాదం గోపి, నాగుల్ మీరా, మాజీ ఎంపీటీసీ నక్కనబోయిన పండు, నెరుసు రాజేష్, ఎస్‌కే సుభాని, వాకా సక్కేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

విస్సన్నపేట: విస్సన్నపేటకు చెందిన మేకల సత్యనారాయణ (54) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. శుక్రవారం స్కూటీపై వెళుతుండగా స్థానిక శ్రీరామ్‌థియేటర్ సమీపంలో కారు ఢీ కొట్టడంతో 108 సిబ్బంది నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు సాంస్కృతిక, సాంకేతిక అంశాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు మూకాభినయం, ఫ్యాషన్ పరేడ్, పాటల పోటీల్లో 400 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంటు పోట్రు నాగేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. పలు పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.


ప్రింటర్, స్పీకర్ అందజేత

నూజివీడు: మండలంలోని పోతురెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు దాతలు శనివారం ప్రింటర్, పోర్టబుల్ స్పీకర్‌లను వితరణగా అందజేశారు. పాఠశాలకు ఎంతో అవసరమని భావించి వీటిని పాఠశాల హెచ్ఎం ఆర్.జయమణికి విజయవాడకు చెందిన అంబేడ్కర్, ఎన్వీ ప్రసాద్ అందించారు. దాతలను హెచ్ఎం జయమణి, పాఠశాల ఉపాధ్యాయులు బొద్దుకోళ్ల బాబూరావు, సుబ్బారావు, సరళకుమారి, సరస్వతి, మురళీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తగరం సునీత, ఉప సర్పంచ్ అక్కినేని రాములు పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయల వితరణ

నూజివీడు: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి నూజివీడు నుంచి దాతలు 12 టన్నుల కూరగాయలను శనివారం పంపారు. మండలంలోని దేవరగుంటకు చెందిన నక్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో టీటీడీకి చెందిన లారీ రాగా అందులో లోడు చేసి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి కోవెల వద్ద పూజలు నిర్వహించిన అనంతరం తిరుమలకు పంపించారు. శ్రీశైలం దేవస్థానానికి, ద్వారకా తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానానికి మూడున్నర టన్నుల చొప్పున కూరగాయలను పంపించారు. విజయవాడలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానానికి 2 టన్నుల కూరగాయలను పంపారు. ఈ కార్యక్రమంలో కే రామ్మోహన్‌రావు, కోదాటి రవి, కే ఉదయ్ పాల్గొన్నారు.

రేకుల షెడ్డు దగ్ధం



గౌరంపాలెం(విస్సన్నపేట): మండలంలోని తాతకుంట్ల పంచాయతీ గౌరంపాలెం గ్రామానికి చెందిన షేక్ బాజీ సైదాకు చెందిన తడికలతో ఉన్న రేకులషెడ్డు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదంలో ఇల్లు, సామగ్రి దగ్ధం అయింది. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఆర్థిక సాయం, బియ్యం రెండు బస్తాలు అందజేశామని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సిరసాని ప్రకాష్, అనుమోలు శివబాజీ, ఎంపీటీసీ మేడా తిరుపతిరావు, షేక్ కాలీషా, మేడా శ్రీనివాసరావు, షేక్ కాసీం, పాపారావు, ఎం.సత్యనారాయణరెడ్డి, అశోక్, కట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి


ఎన్నికల ఏర్పాట్లపై సూచనలిస్తున్న కలెక్టర్, సీపీ

తిరువూరు: సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులు, ప్రజలు సహకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు కోరారు. ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్ టి.కె.రాణాతో కలిసి తిరువూరు నియోజకవర్గంలో ఎన్నికల ఏర్పాట్లనుశనివారం పరిశీలించారు. స్థానిక అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పరిమితికి మించి నగదు తీసుకెళ్లరాదని, సరైన ఆధారాలు లేకుండా తరలించే నగదు, ఇతర విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. మద్యం, డబ్బు పంపిణీ చేయకుండా, దొంగ ఓట్ల పోలింగ్ జరగకుండా కట్టడి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు.సమీపంలోని సరిహద్దు చెక్ పోస్టులను పరిశీలించిన కలెక్టర్ వాహనాల తనిఖీ జరపాలని ఆదేశించారు. మొబైల్ తనిఖీ బృందాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. తిరువూరు నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన, ఓటర్ల జాబితాలో చేర్పులు, మా ర్పులు,ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది ని యామకం తదితర అంశాలను కలెక్టరుకు ఆర్డీఓ మాధవి వివరించారు. తహసీల్దారు రమేష్, నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, సీఐ అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కౌంటర్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన గదులను కలెక్టర్, సీపీ పరిశీలించారు.